ఆంధ్రజ్యోతి



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

ఆదివారం 21 జనవరి 2024



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


మంత్రి పొన్నం ప్రభాకర్


మంత్రి సీతక్క

సర్కారు లక్ష్యాలు నెరవేర్చండి..



హనుమకొండ సిటీ, జనవరి 20: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం ఆయన వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చారు. హనుమకొండలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాల అభివృద్ధి అంశంపై అంతర్గతంగా సమీక్ష జరిపారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచం ద్రునాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యశస్వినీరెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉదయం 11:30గం టలకు ఆరంభమైన సమీక్ష.. సాయంత్రం 5:15గంటల వరకు కొనసాగింది. ప్రతీ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష జరిపారు. అధికారుల నుంచి నివేదికలు కోరారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఆయా నియోజకవర్గాల అభివృద్ధి, ప్రజల సమస్యలు, పరిష్కా ర చర్యలు, నిధుల వ్యయం, కేటాయింపు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలు సేకరించి వాటిని ఆచరణలో పెట్టే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఇరిగేషన్, పంచాయతీరాజ్ పనులే కీలకంగా..

వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, పంచాయతీరాజ్ పనులే కీలకంగా సమీక్ష జరిగింది. జిల్లాలోని వ్యవసాయ సాగు, తాగునీటి వనరులు, ఇరిగేషన్ ప్రాజెక్టుల వివరాలు, పూర్తయినవి, అమల్లో ఉన్నవి, ఇంకా ప్రారంభించని ప్రాజెక్టుల విషయాలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చర్చించారు. అదే విధంగా పంచాయతీరాజ్ శాఖ పనులును సమీక్షించారు. బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గాల వారీగా ప్రకటించిన ప్రాజెక్టులను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రకటించిన ప్రాజెక్టులు ఆచరణలోకి వచ్చాయా.. లేదా.. అసలే చేపట్టనివి ఎన్ని? ప్రారంభించి వదిలేసినవి ఎన్ని? అనే వివరాలను అధికారుల నుంచి సమగ్రంగా సేకరించి సమీక్ష జరిపారు. ప్రతీ నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు, నిధుల కేటాయింపు, నిర్దేశిత లక్ష్యాలు, అభివృద్ధి పనుల ముగింపు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీల దరఖాస్తులు, కంప్యూటరీకరణపై చర్చించారు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, పంపిణీ వివరాలను సమీక్షించారు. 12 నియోజకవర్గాల పెండింగ్ సమస్యల పరిష్కార చర్యలు చేపట్టాలని, అభయహస్తం హామీలను నెరవేర్చాలని సూచించారు. అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని, ప్రజల సమస్యలు, అభివృద్ధి ఫలాలే పని తనానికి కొలమానమని స్పష్టం చేశారు.

- ప్రజలు, ప్రభుత్వానికి వారధులు మీరే..
- నిర్లక్ష్యాన్ని ప్రదర్శించే అధికారులను ఉపేక్షించం
- అమల్లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయండి
- ఇరిగేషన్, పంచాయతీరాజ్ పనులు కీలకం
- ప్రాజెక్టులు, నిధులు, పూర్తిపై మరింత సమాచారమివ్వాలి..
- ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి సమీక్షలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి
- జిల్లాల వారీగా సుదీర్ఘంగా చర్చించిన పొంగులేటి

జాతరను విజయవంతం చేద్దాం..

మేడారం జాతరను సమష్టిగా విజయవంతం చేద్దామని మంత్రి సీతక్క కోరారు. జాతర కోసం ప్రభుత్వం రూ.105కోట్లు కేటాయించిందని

మిగతా 7వ పేజీలో..

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

అభివృద్ధి సమావేశం కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా మారింది. బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య జరిగిన సంభాషణ సమావేశాన్ని వేడెక్కించింది. కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి సమావేశంలో పాల్గొనడం, కమలాపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, ప్రొటోకాల్ అంశాలు రగడకు కారణమయ్యాయి. జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తనకు ప్రొటోకాల్‌ను ఇవ్వడం లేదని, తన నియోజకవర్గంలో కూడా అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇవ్వాలని, ఎమ్మెల్యే కాని వారిని సమావేశంలో ఎలా ఉంటారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో తనకు తెలియకుండా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ జరిగిందంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చెప్పడంతో మంత్రి పొన్నం ప్రభాకర్

మిగతా 7వ పేజీలో..

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధిక నిధులు

- మేడారం జాతరకు రూ.105కోట్లు
- ప్రజాభిప్రాయానికి అనుగుణంగా మాస్టర్‌ప్లాన్
- ప్రగతి భవన్ నిర్మాణానికి 8 నెలలు.. కాళోజీ కళాక్షేత్రానికి పదేళ్లా..?
- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

7


నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన ఆల్ టెర్రేయిన్ వాహనం

జోరుగా.. హుషారుగా..



- ఆకట్టుకున్న ఈవెంట్లు
- ఆలోచింపచేస్తున్న ఎగ్జిబిట్లు
- వివిధ అంశాలపై వర్క్‌షాపులు
- ప్రముఖుల ప్రసంగాలు
- సందడిగా రెండో రోజు టెక్నోజియాన్
- ఆవిష్కృతమైన మినీ భారతం

7

వరంగల్ నిట్ కళాశాలలో రెండోరోజు శనివారం టెక్నోజియాన్ (సాంకేతిక ఉత్సవం)-2024 జోరుగా హుషారుగా సాగింది. శుక్రవారం నిర్వహించిన ఈవెంట్లు రెండోరోజు కూడా కొనసాగాయి. వివిధ అంశాలకు సంబంధించి రూపొందించిన సుమారు మరో 40 కొత్త ఈవెంట్లు శనివారం జరిగాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నిట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు రూపకల్పన చేసిన ఈ ఈవెంట్లు సరికొత్త సాంకేతికతలను ఆవిష్కరించాయి. ఒక్కో ఈవెంట్ ఒక్కో ప్రత్యేకతను చాటాయి. సాంకేతిక ప్రపంచంలో ఎప్పటికప్పుడు చోటు చేసుకుంటున్న నూతన పోకడలను దృష్టిలో ఉంచుకొని వాటికి అనుగుణంగా వీటిని రూపొందించారు. దైనందిన జీవితంలో ప్రజల అవసరాలు, భవిష్యత్తులో ఎదురయ్యే నూతన సవాళ్లను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ ఈవెంట్లలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ప్రతిభాపాటవాలను చాటుకున్నారు.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ కాజీపేట

వివరాలు :7లో..


పాదయాత్రగా వెళ్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

భూపాలపల్లి టు తిరుపతి

- పాదయాత్ర ప్రారంభించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 20: భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాదయాత్ర చేపట్టారు. జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి శనివారం బయల్దేరారు. ముందుగా ఆలయంలో తన భర్త, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డితో కలిసి వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులతో కలిసి పాద యాత్రగా తిరుపతికి బయల్దేరారు. బీఆర్ఎస్ నాయకులు సెగ్గం సిద్దు, కొత్త హరిబాబు, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డితో పాటు పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, పోల్సాని లక్ష్మీనర్సింహరావు, పిల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.


ద్విచక్ర వాహన ర్యాలీలో ఆర్టీవో, పోలీసు అధికారులు

రోడ్డు భద్రతపై అవగాహన

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 20: రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ఆర్టీవో, పోలీసు శాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా దీన్ని చేపట్టారు. ఎంవీఐ సమ్దానీ, భూపాలపల్లి సీఐ రాంనర్సింహరెడ్డి హాజరయ్యారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి జయశంకర్ విగ్రహం మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్‌ను వినియోగించి ప్రమాదాల బారి నుంచి రక్షణ పొందాలని సూచించారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

- సెమీస్‌కు చేరుకున్న నాలుగు జట్లు
- నేడు ఫైనల్స్, హాజరు కానున్న సీఎండీ బలరాం


పోటీపడుతున్న సీసీఎల్ జార్ఖండ్, డబ్ల్యూసీఎల్ మహారాష్ట్ర జట్లు

కాకతీయఖని, జనవరి 20: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో కోలిండియా హాకీ పోటీలు శనివారం హోరాహోరీగా కొనసాగాయి. పట్టణంలోని అంబేద్కర్ క్రీడామైదానంలో ఇవి జరుగుతున్నాయి. సెమీఫైనల్‌కు నాలుగు జట్లు చేరుకున్నాయి. మొదటి మ్యాచ్‌లో ఎస్ఈసీఎల్ ఛత్తీస్‌గఢ్, ఎంసీఎల్ ఒడిశా తలపడ్డాయి. ఎస్ఈసీఎల్ ఛత్తీస్‌గఢ్ జట్టు రెండు గోల్స్ చేయగా ఎంసీఎల్ ఒడిశా జట్టు ఒక గోల్ చేసింది. విజేతగా ఎస్ఈసీఎల్ జట్టు నిలిచింది. అనంతరం సీసీఎల్ జార్ఖండ్, డబ్ల్యూసీఎల్ మహారాష్ట్ర జట్టు పోటీపడ్డాయి. సీసీఎల్ జార్ఖండ్ జట్టు నాలుగు గోల్స్ చేయగా డబ్ల్యూసీఎల్ మహారాష్ట్ర జట్టు ఒక గోల్ చేసింది. సీసీఎల్ జార్ఖండ్ జట్టు చేతిలో డబ్ల్యూసీఎల్ మహారాష్ట్ర జట్టు మూడు గోల్స్ తేడాతో ఓటమిని చవిచూసింది. తిరిగి మధ్యాహ్నం ప్రారంభమైన మ్యాచ్‌లో ఎస్‌సీసీఎల్ తెలంగాణ, బీసీసీఎల్ జార్ఖండ్ జట్లు తలపడ్డాయి. ఇందులో ఎస్‌సీసీఎల్ తెలంగాణ జట్టు నాలుగు గోల్స్ చేయగా ప్రత్యర్థి జట్టు బీసీసీఎల్ జార్ఖండ్ జట్టు గోల్స్ ఏమీ చేయకుండానే చేతులెత్తేసింది. చివరిగా ఈసీఎల్ వెస్ట్ బెంగాల్, ఎన్‌సీఎల్ మధ్యప్రదేశ్ జట్లు తలపడ్డాయి. ఇందులో ఎన్‌సీఎల్ మధ్యప్రదేశ్ జట్టు మూడు గోల్స్ చేయగా ఈసీఎల్ వెస్ట్ బెంగాల్ స్కోర్ చేయకుండానే ఓడిపోయింది.

సెమీస్‌కు నాలుగు టీమ్‌లు

కోలిండియా హాకీ పోటీల్లో నాలుగు జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. ఎస్ఈసీఎల్ ఛత్తీస్‌గఢ్, ఎస్‌సీసీఎల్ తెలంగాణ, సీసీఎల్ జార్ఖండ్, ఎన్‌సీఎల్ మధ్యప్రదేశ్ జట్లు ఉన్నాయి. ఆదివారం జరగనున్న మొదటి సెమీఫైనల్‌లో ఎస్ఈసీఎల్ ఛత్తీస్‌గఢ్, ఎన్‌సీఎల్ మధ్యప్రదేశ్ జట్లు తలపడనున్నాయి. అలాగే రెండో సెమీఫైనల్‌లో ఎస్‌సీసీఎల్ తెలంగాణ, సీసీఎల్ జార్ఖండ్ జట్లు పోటీ పడనున్నాయి. వీటిలో గెలిచిన రెండు జట్లు అదే రోజు మధ్యాహ్నం ఫైనల్స్ ఆడుతాయి. బహుమతుల ప్రదానోత్సవంలో సింగరేణి సీఎండీ బలరాం నాయక్ హాజరు కానున్నారు. ఫైనల్స్‌లో గెలుపొందిన విన్నర్, రన్నర్ టీంలకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించనున్నారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు

- మేడారానికి భారీగా తరలివచ్చిన భక్తులు


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 20 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి భక్తులు శనివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర జరగనున్న నేపథ్యంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను ముందస్తుగా దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి సైతం కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ముందుగా జంపన్నవాగులో స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం)తో మొక్కులు చెల్లించుకున్నారు. చల్లగా చూడాలని తల్లులతను వేడుకున్నారు. మొక్కుకున్నారు. సుమారు 20వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారని ఈవో రాజేంద్రం తెలిపారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- 562 మందికి ఉద్యోగం


యువతికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఐటీడీఏ ఏపీవో, కంపెనీ ప్రతినిధులు

ములుగు, జనవరి 20: మండలంలోని జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 562 మంది గిరిజన యువతీ యువకులకు ఉద్యోగాలు వచ్చాయి. 23 ప్రైవేటు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 676 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. నైపుణ్యాలను పరీక్షించిన కంపెనీల ప్రతినిధులు 562 మందికి తమ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించారు. కనిష్ఠంగా రూ.15వేలు, గరిష్ఠంగా రూ.35వేల నెలవారీ వేతనాన్ని నిర్ణయించారు. ఏపీవో వసంతరావు, కంపెనీ ప్రతినిధుల చేతుల మీదుగా ఉద్యోగార్థులకు నియామక పత్రాలను అందజేశారు. రాబోయో రోజుల్లో ఇలాంటి జాబ్ మేళాలను ఎక్కువ ప్రదేశాలలో నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామని ఏపీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ బాలస్వామి, డీపీఎం సతీష్, జేడీఎం కొండలరావు, ఏపీఎంలు, లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి


- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి టి.మాధవి


సదస్సులో మాట్లాడుతున్న మాధవి

ములుగు కలెక్టరేట్, జనవరి 20: బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి టి.మాధవి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా బాలరక్షాభవన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, పోక్సో చట్టాలు, ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. వార్డెన్ వ్యక్తిగతంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

అన్ని రంగాల్లో సాంకేతికతే కీలకం

- సవాళ్లను అధిగమిస్తేనే విజయం
- టెక్నోజియాన్‌లో రెడ్ బస్ సీఈవో ప్రకాశ్ సంగం


విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రకాశ్ సంగం

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో సాంకేతికతే కీలకమని, ప్రస్తుత ప్రపంచంలో సాంకేతిక సాయం లేకుండా ముందుకు వెళ్లలేమని రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం అన్నారు. వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన అతిథి ప్రసంగం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. ముఖ్యంగా వ్యాపార రంగంలో సాంకేతికత కీలకభూమిక పోషిస్తుందన్నారు. సాంకేతికత జీవితాలను ఎలా మారుస్తుందో ఇంజనీర్లు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రతీ రంగంలో సవాళ్లు, సమస్యలు ఉంటాయని, వాటిని అర్థం చేసుకొని పరిష్కరించుకుంటూ వెళ్లడం తోనే విజయం సాధ్యం అవుతుందన్నారు. రెడ్ బస్ మార్కెట్‌లో పోటీని ఎలా ఎదుర్కొన్నది, వాటిని ఎలా అధిగమించింది సోదాహరణగా ఆయన వివరించారు. పట్టుదల, కృషి, నిబద్ధత, నిజాయితీలే ప్రతీ మనిషి విజయ శిఖరాలను అందుకోవడానికి నిచ్చెనమెట్లలాగా ఉపయోగపడతాయన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు తరగతి గదిలో తాము నేర్చుకున్నదే కాకుండా క్షేత్రస్థాయిలో దానిని ఆచరణాత్మకం చేయాలని అన్నారు. అప్పుడే మనం నేర్చుకున్న జ్ఞానానికి సార్థకత లభిస్తుందన్నారు. రెడ్ బస్ సీఈవోగా తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

సాంకేతిక విజ్ఞానదాయిని

టెక్నోజియాన్

విద్యార్థుల మనోభావాలు

ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్ కళాశాలలో నిర్వహిస్తున్న టెక్నోజియాన్ విజ్ఞానదాయకంగానూ, స్ఫూర్తిమంతంగానూ ఉందని ఇందులో పాల్గొంటున్న పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. టెక్నోజియాన్‌లో పాల్గొనడం తమ అదృష్టంగా పేర్కొన్నారు. ఎన్నో కొత్త విషయాలను నేర్చుకుంటున్నామని చెప్పారు. తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించాలనుకునే ఇంజినీరింగ్ విద్యార్థులు ఇలాంటి టెక్నోఫెస్ట్‌లో తప్పకుండా పాల్గొనాలని అన్నారు. వారి మాటల్లోనే...

పాల్గొనడం ఇది మూడోసారి



మధురెడ్డి, బీటెక్ ఫైనల్ ఇయర్ (ట్రిపుల్ ఈ), గుంటూరు

వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్నోజియాన్‌లో వరుసగా పాల్గొనడం ఇది మూడోసారి. హాజరైన ప్రతీసారి సాంకేతికంగా కొత్త విషయాలను నేర్చుకుంటున్నాను. సరికొత్తగా చోటుచేసుకుంటున్న సాంకేతిక ఆవిష్కరణలను అర్థం చేసుకోవడానికి, సాంకేతికంగా మన ఆలోచనలకు పదును పెట్టడానికి టెక్నోజియాన్ మంచి వేదిక.

కొత్త ఆలోచనలకు అంకురం టెక్నోజియాన్



దేవిశ్రీ, బీటెక్ ట్రిపుల్ ఈ, వైజాగ్

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు, వినూత్న సాంకేతిక ఆవిష్కరణలకు సమష్టిగా కృషి చేయడానికి టెక్నోజియాన్ ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. విద్యార్థుల్లో వైజ్ఞానిక జిజ్ఞాసను పెంపొందించేందుకు టెక్నోజియాన్‌ను మించిన వేదిక మరొకటి లేదు. ఈ ఈవెంట్ టీమ్ లీడర్‌గా తాను ఈ టెక్‌ఫెస్ట్‌లో పాల్గొంటున్నాను

కొత్త జ్ఞానానికి ద్వారం టెక్నోజియాన్



హర్ష, మెకానికల్ సెకండ్ ఇయర్, హైదరాబాద్

జ్ఞానాన్ని విస్తరింప చేసుకునేందుకు, నలుగురితో కలిసి పనిచేసేందుకు, మనలోని భావాలను ఇతరులతో పంచుకునేందుకు టెక్నోజియాన్ ఎంతో ఉపయోగపడుతుంది. మొదట్లో నాకు స్టేజి ఫియర్ ఉండేది. టెక్నోజియాన్‌లో పాల్గొన్న తర్వాత అది పోయింది. నాలో నాయకత్వ లక్షణాలు బలపడ్డాయి. టెక్నోజియాన్ నిర్వహణ బాగుంది. ఏర్పాట్లు బాగా చేశారు.

- సుబేదారి

జోరుగా.. హుషారుగా...

సందడిగా రెండో రోజు టెక్నోజియాన్

హనుమకొండ(ఆంధ్రజ్యోతి)/కాజీపేట, జనవరి 20: టెక్నోజియాన్‌లో భాగంగా నిట్ క్యాంపస్‌లో ప్రదర్శనగా పెట్టిన పలు సాంకేతిక ఎగ్జిబిట్లు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ హాళ్లలో, క్యాంపస్ ఆవరణలో వీటిని నిర్వహించారు. నిట్ విద్యార్థులతో పాటు నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు స్వయంగా రూపొందించిన సైన్స్ ఎగ్జిబిట్లు సైతం టెక్నోజియాన్‌లో సందర్శనార్థం పెట్టారు. టెక్నోజియాన్ అంటే ఉన్నత సాంకేతిక విద్యా సంస్థల విద్యార్థులకే పరిమితం చేయకుండా పాఠశాల స్థాయిలో సైన్స్ పట్ల ఆసక్తి కలిగిన ఔత్సాహిక విద్యార్థులను సైతం ప్రోత్సహించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు టెక్నోజియాన్‌లోని ఈవెంట్లు, ఎగ్జిబిట్లను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీనితో నిట్ క్యాంపస్ విద్యార్థులతో సందడిగా మారింది. అడుగడుగునా సాంకేతిక సౌరభాలు గుబాళించాయి. ఉదయం 9 గంటల నుంచే టెక్నోజియాన్ కార్యక్రమాలు ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగాయి.

వర్క్‌షాపులు

ఒకపక్క ఈవెంట్ల నిర్వహణతో పాటు మరోపక్క వివిధ అంశాలపై వర్క్‌షాపులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో వైజ్ఞానిక ప్రసంగాలు కూడా కొనసాగాయి. ఎలక్ట్రికల్ వెహికిల్ మోడలింగ్, సిమ్యులేషన్‌పై వర్క్‌షాపును ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు నిర్వహించారు. వీరు మ్యాట్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి సిమ్యులేషన్ ద్వారా ఎలక్ట్రికల్ వాహనాన్ని ఎలా రూపొందించాలో విద్యార్థులకు ప్రదర్శన రూపకంగా వివరించారు. దీనితో పాటు రాపిడ్ ప్రోటోటైపింగ్, 3డి ప్రింటింగ్‌పై నిర్వహించిన మరో వర్క్‌షాపు కూడా విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నది. మెకానికల్ ఇంజనీరింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాపులో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్యాప్చర్ ఎక్స్ అనే సైబర్ భద్రతపై ప్రాథమిక అవగాహనకు శిక్షణనిచ్చే మరో వర్క్‌షాపు కూడా ఈ టెక్నోజియాన్‌కే హైలైట్. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ సొసైటీ ఈ వర్క్‌షాపును సమన్వయం చేసింది.

వైజ్ఞానిక ప్రసంగం

రెడ్‌బస్ జర్నీపై రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం ఇచ్చిన అతిథి ఉపన్యాసం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది. ఈ ప్రసంగం విని చాలా మంది విద్యార్థులు స్ఫూర్తి పొందారు. రెడ్‌బస్ జర్నీ ప్రస్థానంలో ఎదురైన సవాళ్లు, ప్రతిఘటనలు, విజయాలపై ప్రకాశ్ సంగం సుదీర్ఘంగా ప్రసంగించారు. విద్యార్థులు ఆయనతో కలిసి ఫొటో దిగేందుకు ఉత్సాహం చూపారు. తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



పింగ్ పాంగ్ లాంచర్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

రెండో రోజు ఈవెంట్లు

ఇన్‌సైట్ ఎక్స్, క్యాప్చర్ ఎక్స్, పరిష్కార్, ఆటో ఫ్రాగస్, వెహికిల్ డెమోన్‌స్ట్రేషన్, డిబగ్గింగ్ మానియా, ఇన్నోవేటివ్ స్పేయర్ ఎక్స్‌పో, విర్చువల్ వరల్డ్, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, కెమ్ ఈ కేస్, కెమ్ ఈ లిబ్రింత్, సైన్స్ ఎక్స్‌పో, కెమ్ ఫైర్, కెమ్ స్టోరీ, ఎక్స్‌పర్ట్ లెక్చర్, లేజర్ బేస్డ్ గేమ్, ఇన్నోవేటివ్ పెయింటింగ్, మ్యాథ్స్ అండ్ రేట్స్, ఆర్కాడీరియమ్, మైండ్ గ్రిండ్, మెటల్షన్, మెటా రష్, పేపర్ ప్రజంటేషన్, ఎలక్ట్రిక్ ఎక్స్‌పో, రెసిస్టెన్స్ రిలే రేస్, పీజో పవర్ ఆర్కేడ్ నిర్వహించారు. స్పాట్‌లైట్ ఈవెంట్ల విభాగంలో వీఆర్ క్రికెట్, ఎస్కేప్ రూమ్ 1, ఎస్కేప్ రూమ్ 2, ఆర్ బగ్గీ నిర్వహించారు. వీటితో పాటు స్టాడ్‌ప్రో, మ్యాట్‌ల్యాబ్ వినియోగించడం ద్వారా ఈవీ స్టిమ్యులేషన్‌పై వర్క్‌షాపులు జరిగాయి. డాక్టర్ నిపట్లపల్లి నర్సమ్మ గెస్ట్ లెక్చర్ ఇచ్చారు.

నేడు విజేతల ఎంపిక

వరంగల్ నిట్‌లో జరుగుతున్న టెక్నోజియాన్‌లో భాగంగా చివరి రోజైన ఆదివారం ఈవెంట్లతో పాటు వర్క్‌షాపులు, గెస్ట్‌లెక్చర్లు కూడా ఉంటాయి. సాయంత్రం 6 గంటలకు ఆడిటోరియంలో ముగింపు కార్యక్రమం ఉంటుంది. ఇందులో టెక్నోజియాన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాల ప్రదానం ఉంటుంది.

త్రిడీ ప్రింటర్

బ్యాడ్జీలు, కీచైన్లను ముద్రించడానికి ఉపయోగించే ప్రింటర్ ఇది. స్కూల్ విద్యార్థుల బ్యాడ్జీలను కానీ, వివిధ కంపెనీల కీచైన్లు, ఇతరత్రా లోగోలను డిజైన్‌చేసి దానిని కంప్యూటర్‌కు అనుసంధానం చేయడం ద్వారా కొద్ది నిమిషాల్లోనే వాటిని ముద్రణలోకి తీసుకురావచ్చు. దీనివల్ల ఖర్చు తక్కువ. సమయం కూడా వృథాకాదు. త్రిడీ ప్రింటర్‌ను పాఠశాల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.



ఆర్టిమేనియా



ఇది నైపుణ్యంతో రోబోలను నిర్దేశిత గమ్యస్థానం వరకు నడిపే ఈవెంట్. ఇందులో పాల్గొనే వారు తమ రోబోలతో పాల్గొనాల్సి ఉంటుంది. రోబోలు నడిపే మార్గంలో అనేక అడ్డంకులు ఉంటాయి. వాటిని అధిగమిస్తూ నిర్దేశిత గమ్యానికి రోబోలను ఎవరైతే విజయవంతంగా నడిపిస్తారో వారే విజేతలు.

పోటా పోటీగా ఈవెంట్లు

- వినూత్న రీతిలో నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్నోజియాన్‌లో భాగంగా ప్రదర్శిస్తున్న పలు ఈవెంట్లు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. విద్యార్థులు ఈవెంట్లలో పోటాపోటీగా పాల్గొంటున్నారు. విజేతలుగా నిలవడానికి శ్రమిస్తున్నారు. ఈవెంట్లలో మచ్చుకు కొన్ని...

ఈపీవీ రేసింగ్



టెక్నోజియాన్‌లోని రెండు అక్షరాలు టిజెడ్‌తో ఒక డిజైన్‌ను రూపొందించారు. ఈ డిజైన్‌లో గీతలను తాకకుండా రోబో లను నడపాలి. ఇలా ఎవరైతే నడుపుతా రో వారే విజేతలు. నగదు బహుమతిని అందచేస్తారు. ఈ ఈవెంట్‌లో 40మందికి పైగా విద్యార్థులు రోబోలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రోబోలను చాకచక్యంగా నడపడమే ఈ ఈవెంట్ లక్ష్యం

ఆల్ టెర్రేయిన్ వాహనం



వరంగల్ నిట్‌లోని మెకానికల్ విద్యార్థులు స్వయంగా రూపొందించిన ఈ ఆల్ టేర్రేయిన్ వాహనం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొండలు, గుట్టలు, ఇతర ఎత్తైన ఏ ప్రాంతంలోనైనా ఈ వాహనం నడవగలుగుతుంది. ఇటీవల నిర్వహించిన వాహనాల ప్రదర్శనలో దీనికి రూ.15వేల నగదు బహుమతి కూడా లభించింది. ప్రస్తుతం సింగిల్ సీటర్ వాహనాన్ని రూపొందించారు. దీనిని తయారు చేయడానికి రూ.10లక్షల వరకు ఖర్చయింది. ఇందులో ఉపయోగించిన విడిభాగాలన్నీ విద్యార్థులే స్వయంగా తయారు చేశారు.

పియోజ్ పవర్ ఆర్కాడ్



వరంగల్ నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సొసైటీ వారు ఈ పరికరాన్ని రూపొందించారు. వ్యక్తుల శక్తిని అంచనా వేయడానికి రూపొందించిన పరికరం ఇది. పీజోమెటీరియల్‌తో ప్యాడ్‌ను రూపొందించారు. దీనిపై సుత్తితో ఒక మనిషి కొడితే ఉత్పన్నమయ్యే శక్తిని పీజోమెటీరియల్ సర్క్యూట్ రికార్డు చేసి దానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రదర్శిస్తుంది. మెకానికల్ ఎనర్జీని ఎలక్ట్రికల్ ఎనర్జీగా మార్చడమే ఈ పరికరం ముఖ్య ఉద్దేశ్యం.

పిక్సల్ నుంచి పోర్ట్రేయిట్‌లు



కంప్యూటరైజ్డ్ న్యూమెరికల్ కంట్రోలర్ మెషిన్ నిజమైన ఇమేజ్‌ను రూపొందించడమే ఈ ఈవెంట్ ముఖ్య ఉద్దేశం. సాధారణంగా ఒక వ్యక్తి చిత్రాన్ని పెన్సిల్‌తో లేదా రంగులతో చేయితో వేస్తాం. లేదా ఫోటో తీస్తాం. కానీ ఇక్కడ ఒక వ్యక్తి చిత్రాన్ని న్యూమెరికల్ కంట్రోలర్ మెషిన్ కంప్యూటర్ సహాయంతో నిజమైన ఇమేజ్‌గా కొద్ది సెకండ్లలో రూపొందిస్తుంది.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధిక నిధులు

ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తాం

రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జనవరి 20 : రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో ఆడంబరాలు, ఆర్భాటాలే తప్ప.. అభివృద్ధిని ఆచరణలో చూపలేదని విమర్శించారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి అంశంపై హనుమకొండలోని కలెక్టరేట్‌లో సమీక్ష జరిపారు. సమీక్ష అనంతరం మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు తమ స్వార్థప్రయోజనాల నెరవేర్చుకునేందుకే పాలన సాగించారన్నారు. అంతేకానీ.. ప్రజలకు, నియోజకవర్గాలకు ఉపయుక్తమయ్యే అభివృద్ధిని సాధించలేదేని విమర్శించారు. ప్రతీ ప్రాజెక్టు ప్రకటన వెనుక స్వలాభం చూసుకున్నారని ఆరోపించారు. ఆ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో కానీ, ప్రజలకు ఉపయోగపడేలా మలచడంలో నిజాయితీగా వ్యవహరించలేదని మండిపడ్డారు. ప్రతీ శాఖలో ఇదేతీరు నెలకొందన్నారు. వీటన్నింటినీ కూలంకశంగా సమీక్షించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో ప్రకటించిన ప్రాజెక్టుల వల్ల ప్రజలకు జరిగే మేలు, నిధుల వ్యయం, వాటి పూర్తి తదితర అంశాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా కాంగ్రెస్ పాలన సాగుతుందన్నారు. ప్రజాపాలన ద్వారా సేకరించిన దరఖాస్తుల కంప్యూటీకరణ తదుపరి అమలు ప్రక్రియ ఉంటుందన్నారు.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ నగరాభివృద్ధి కోసం ప్రజాభిప్రాయానికి అనుగుణమైన మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయనున్నట్లు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ నేతలు తమ స్వార్థ ప్రయోజనాలు, భూములకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించారని ఆరోపించారు. దీనిని ప్రక్షాళన చేసి సమగ్ర సవరణలతో నగరాభివృద్ధి, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ఆమోదయోగ్యమైన మాస్టర్‌ప్లాన్ తీసుకొస్తామన్నారు. ఇందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. నగరంలో త్వరలోనే రెండు పడక గదుల పంపకాన్ని చేపడతామన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలం, రూ.5 లక్షలు అందచేస్తామన్నారు.

> మేడారం జాతర నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.105కోట్లు కేటాయించిందని మంత్రి సీతక్క వెల్లడించారు.
>
> **మేడారం జాతరకు రూ.105 కోట్లు**
>
> రు. తొలుత రూ.75 కోట్లు ప్రకటించామని, మరో రూ.30 కోట్లు కూడా జాతర నిర్వహణకు ఇవ్వనున్నట్లు చెప్పారు.

కాళోజీ కళాక్షేత్రానికి పదేళ్లా..?

బీఆర్ఎస్ పాలన ఎంత స్వార్థరహితమో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రమే నిదర్శనమని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ప్రగతిభవన్ 8నెలల్లో పూర్తయ్యిందని, కాళోజీ కళాక్షేత్రం మాత్రం పదేళ్ల గడిచినా పూర్తి కాలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన కళాక్షేత్రాన్ని తాము పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

కాలువల అభివృద్ధికే మోక్షం లేదు..

ఇరిగేషన్ ప్రాజెక్టు పేరిట బీఆర్ఎస్ బీరాలు పలికిందని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని, పచ్చని తెలంగాణగా మారుస్తామన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు నీటి మూటలయ్యాయని దుయ్యబట్టారు. ఇరిగేషన్‌పరంగా తెలంగాణను ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలుపుతామని ప్రగల్భాలు పలికిన బీఆర్ఎస్.. కనీసం ప్రధాన కాలువలను అభివృద్ధి చేయలేదని విమర్శించారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు అస్తవ్యస్తంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇరిగేషన్ రంగంపై ప్రత్యేక దృష్టితో ఉందన్నారు. బీఆర్ఎస్‌లా కాకుండా పక్కా ప్రణాళికలతో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని వెల్లడించారు.

కబ్జారాయుళ్లను వదలం

ప్రభుత్వ భూములను దొడ్డిదారిన కాజేసిన బీఆర్ఎస్ నేతలను వదలమని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. కబ్జారాయుళ్ల ఎంతటి వారైనా సరే చర్యలు ఉంటాయన్నారు. అన్యాక్రాంతమైన భూములను జీవో 59 ద్వారా అర్హులైన పేదలకు అందచేస్తామన్నారు.

ప్రజలు పండబెట్టారు..

పులి వస్తోంది.. అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నకు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పులి వంద మీటింగ్‌లు పెట్టింది.. ఏం జరిగింది.. ప్రజలు పండబెట్టారంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను ప్రజలు తిరస్కరించిన సంగతి గుర్తించాలన్నారు. ఇక జనవరి నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించొద్దనే ప్రకటనలు చేస్తూ మాజీ మంత్రి కేటీఆర్ తెగ బాధపడుతున్నారని శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చిన సంగతి, దానిని అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు ఉందని సమాధానమిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందన్నారు.

ప్రజా పాలనకు అర్థం కాంగ్రెస్

ప్రజాపాలన అనే దానికి పరిపూర్ణ అర్థం కాంగ్రెస్ అని మంత్రి సురేఖ వెల్లడించారు. అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్ పాలనలోనే జరిగిందన్నారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్న సంతోషం ప్రజల్లో స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. ఒక్కో నియోజకవర్గంలో అలవికాని విధంగా రూ.300 కోట్లకు పైగా అభివృద్ధి పనులంటూ ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ నిధుల విషయంలో కూడా బీఆర్ఎస్ అనాలోచితంగా వ్యవహరించిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో బిల్లులు లేక సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న సంగతి కేటీఆర్ గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ అన్నారు. ఆయనకు సర్పంచ్‌ల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, యశస్వినీరెడ్డి, మురళీనాయక్ పాల్గొన్నారు.

సర్కారు లక్ష్యాలు నెరవేర్చండి..

(5వ పేజీ తరువాయి)

గుర్తుచేశారు. అందరం సమష్టి కృషితో జాతర విజయవంతంగా పూర్తి చేద్దామన్నారు. రామప్ప, లక్నవరం సరస్సుల అనుసంధానం కోసం భూసేకరణ జరిగిందన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలన నిర్బంధంలో సాగిందని, ఉద్యోగులు ఒత్తిడికి గురయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరి సంక్షేమాన్ని కోరేదని, స్వేచ్ఛగా ప్రజలకు సేవలు అందించండని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలని, నిర్లక్ష్యం ప్రదర్శించవద్దన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. ఇందులో ఎలాంటి వివక్షకు తావులేదన్నారు. బీఆర్ఎస్ స్వార్థపాలన ముగిసిందని, ప్రజలు కోరుకున్న ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అభివృద్ధి ఫలాలను ఆచరణలో చూపాలని కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వరంగల్ మహానగరాభివృద్ధి కోసం జీడబ్ల్యూఎంసీకి అధిక నిధులు కేటాయించాలని కోరారు. పశ్చిమలో కబ్జాకు గురైన చెరువులు, కుంటల పరిరక్షణ జరగాలన్నారు. అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. ఎవరికి భయపడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. మడికొండ డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. డంపింగ్ యార్డులో పొగ కారణంగా పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. విలీన గ్రామాల్లో సమస్యలు నెలకొన్నాయని, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల సేవలు మెరుగ్గా అందించాలని సూచించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని మూడు డివిజన్లు పరకాల నియోజకవర్గంలో ఉన్నాయని వీటి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అన్నారు. నిధులు కేటాయించాలని కోరారు.

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

(5వ పేజీ తరువాయి)

ఫైర్ అయ్యారు. ఎవరిని పిలవాలో.. ఎవరిని వద్దనాలో.. తమకు తెలుసని.. ఇదేం మీ ప్రభుత్వం కాదంటూ మంత్రి పొన్నం ఫైర్ అయినట్లు తెలిసింది. అంతలోనే మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ విషయంలో అధికారుల తీరుపై విచారణ జరిపిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి చెప్పినట్లు తెలిసింది. అంతటితో పరిస్థితి సద్దుమణిగింది.

సమీక్షకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల దూరం

హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు డాక్టరు బండా ప్రకాశ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్‌లకు సమాచారం లేనట్లు తెలిసింది. ఈ విషయమై వారు అధికారుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

అభివృద్ధి పనులపై నజర్

వివిధ ప్రాంతాలను సందర్శించిన మంత్రి పొంగులేటి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 20: వరంగల్ నగర పర్యటనకు శనివారం వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నగరాభివృద్ధి ప్రణాళికలు, పనులను పరిశీలించారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని పెద్దపెండ్యాల కరుణాపురం జంక్షన్ వద్ద మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు స్వాగతించారు. అనంతరం కరుణాపురం వద్ద జంక్షన్ నిర్మాణం, స్వాగత తోరణం, రింగ్ రోడ్డు బ్రిడ్జి మీదుగా హైదరాబాద్-హనుమకొండ జాతీయ రహదారికి అనుసంధానంగా ఫ్లైఓవర్ నిర్మాణం అంశాలను శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. హైదరాబాద్ నుంచి వరంగల్‌కువెళ్లే రోడ్డు మార్గం సరిగ్గా లేదని ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయం మేరకు మంత్రులు సందర్శించారు. సంబంధించిన మ్యాప్‌ను మంత్రులకు వివరించారు. అనంతరం రోడ్డు మార్గం లోపాలను సమగ్ర వివరాలతో నివేదికను సిద్ధం చేయాలని హైవే అథారిటీ, కుడా అధికారులను మంత్రి ఆదేశించారు. వరంగల్‌కు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం ఉండే విధంగా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టరేట్‌లో సమీక్ష జరిపారు. అక్కడి నుంచి సాయంత్రం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.



నిర్మాణాలను మంత్రులకు వివరిస్తున్న గృహ నిర్మాణ మండలి, రామ్‌కీ ఇన్‌ఫ్రా అధికారులు



హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

అనంతరం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని రాంకీ గేటెడ్ కమ్యూనిటీలో రాంకీ నిర్మించి తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ మండలికి అప్పగించిన అల్పాదాయ వర్గాల 102 గృహాల సముదాయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ నిర్మాణాల వివరాలను తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ మండలి ఈఈ రాధాకృష్ణ (హైదరాబాద్), రాంకీ ఇన్‌ఫ్రా ఏజీఎం అనిల్‌లు మంత్రులు శ్రీనివాసరెడ్డి, సురేఖలకు వివరించారు. నిర్మాణాలను నాణ్యతతో సత్వరం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

మేడారంలో పారిశుధ్య పనులు ముమ్మరం

మేడారం, జనవరి 20 : మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో మేడారంలో పారిశుధ్య పనులు ముమ్మరమయ్యాయి. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు డీపీవో వెంకయ్య 150 మంది కార్మికులతో శనివారం ఈ పనులను ప్రారంభించారు. జంపన్నవాగు, చిలకలగుట్ట, దేవస్థానం పరిసరాలు, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కార్మికులు చెత్తను తొలగించారు. భక్తులు వదిలిన ఆహార వ్యర్థాలను తొలగించి దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లారు. చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్లకు తరలించారు. ఆదివారం మరికొంత మందితో పనులు చేపట్టనున్నట్టు కార్యదర్శి సతీష్ తెలిపారు.

కారు చీకట్లో స్నానఘట్టాలు

వనదేవతలను దర్శించుకోవడానికి శనివారం వచ్చిన భక్తులు జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడ విద్యుద్దీపాలు లేక అవస్థ పడ్డారు. దేవాదాయ శాఖ అధికారులు స్నానఘట్టాలపై కనీసం లైట్లను ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. అలాగే తాగునీరు, గద్దెల పరిసరాల్లో మరుగుదొడ్లు లేక మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

ప్రసాదం లేక..

వనదేవతలను దర్శించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రసాదం లేకుండానే తిరుగుప్రయాణమయ్యే పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించుకొని చిటికెడు ప్రసాదం తీసుకోలేకపోతున్నమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జాతర ముందస్తుగా ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారు.



చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

మల్హర్, జనవరి 20: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘ టన మండల కేంద్రమైన తాడిచర్లలో చోటుచేసుకుంది. కొయ్యూర్ పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం..

తాడిచర్ల గ్రామానికి చెందిన చొప్పరి శ్రీనివాస్ (28) భూపాలపల్లిలోని ఓసీ-3లో ఓల్వో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ఓ యువతిని అతడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏడాది క్రితం ఆమె శ్రీనివాస్‌ను విడిచి వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన అతడికి ఆర్థిక ఇబ్బందులు వెంటాడాయి. దీంతో మనస్తాపం చెందాడు. శుక్రవారం కుటుంబమంతా పనులకు వెళ్లగా శ్రీనివాస్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతడు ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు ఇంటికి వచ్చి చూడగా కొన ఊపిరితో ఉన్న శ్రీనివాస్‌ను భూపాలపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఆధార్ సెంటర్ల సంఖ్యను పెంచాలి : ఆమ్‌ఆద్మీ

భూపాలపల్లిటౌన్, జనవరి 20: సరిపడా ఆధార్ సెంటర్లు లేకపోడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ అరవింద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆధార్ సెంటర్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. సరిపడా ఆధార్ సెంటర్లు లేకపోవ డంతో ప్రజలు గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వస్తోందని పేర్కొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, జనవరి 20: భూపాలపల్లిలోని తెలంగాణ మైనారిటీ కళాశాలలో ఇంటర్మీడియట్ (2024-25) ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాటి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు చక్కటి హాస్టల్ వసతి ఉందని, అనుభజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో చేరేందుకు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు అవకాశం ఉందని తెలిపారు.

గొంతెమ్మగుట్ట లక్ష్మీదేవర జాతర ఏర్పాట్లు షురూ..



గుట్టపై పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు, ప్రజలు

కాటారం, జనవరి 20: మండల పరిధి ప్రతాపగిరి అటవీ ప్రాంతంలోని గొంతెమ్మగుట్టపై మూడు రోజుల పాటు జరిగే లక్ష్మీదేవర జాతర ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆయా పనులను ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ రవీందర్‌రావు, సర్పంచ్ లక్ష్మి, పీఆర్ డీఈఈ సాయిలు, ఏఈ అశోక్ శనివారం పరిశీలించారు. ఈనెల 26 నుంచి 28 వరకు జరిగే జాతరలో పలు జిల్లాల నుంచి లక్ష్మీదేవరలు, నిర్వాహకులు, వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులతో కలిసి ఎంపీపీ పరిశీలించారు. వివిధ ఏర్పాట్ల కోసం రూ. 20లక్షలు మంజూరు అయినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో నాయకపోడ్ సంఘం నేతలు వినోద్, సమ్మయ్య, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

గోవిందరావుపేట, జనవరి 20: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పస్రాలో ఎస్సై షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం రోడ్డు భద్రత నియమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై షేక్ మస్తాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తెలుసుకోవాలని అన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రతి మూడు నిమిషాలకు అదే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడుతున్నారని అన్నారు. ఎక్కువశాతం అతివేగంతో వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవిస్తుందని అన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రూల్స్‌ను పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- వెంకటాపూర్(రామప్ప): ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ములుగు రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పాలంపేట గ్రామంలో ఆయన భద్రత, జీవన రక్ష పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అజాగ్రత్తగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి అమూల్యమైన జీవితాలను కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, మద్యం సేవించడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చల్ల రాజు, రవాణాశాఖ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాటారం-మేడారం రహదారికి మరమ్మతులు

కాటారం, జనవరి 20: మేడారం మహాజాతర జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పలు చర్యలు చేపడుతోంది. జాతరకు వెళ్లి, వచ్చే వేలాది వాహనాలు తిరిగే ప్రధానమైన రహదారులు సక్రమంగా ఉండేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కాటారం-మేడారం ప్రధాన రహదారికి మరమ్మతులు ప్రారంభమయ్యాయి. 60 కిలోమీటర్ల మేర డబుల్‌రోడ్డుపై ఉన్న గుంతలను, కల్వర్టుల వద్ద భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్నారు. ఐదారు రోజుల్లో రహదారి ఇవి పూర్తవుతాయని అధికారులు తెలిపారు. ఈ మరమ్మతులు సక్రమంగా లేవని, తూతూమంత్రంగా చేస్తున్నారని వాహనదారులు అంటున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా వేయడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులు, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డుకిరువైపులా పొదలు, పిచ్చిమొక్కలను తొలగింపజేయాలని పలువురు కోరుతున్నారు.

భూపాలపల్లి సీఐ బదిలీ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 20: భూపాలపల్లి పట్టణ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎ. రాంనర్సింహారెడ్డి బదిలీ అయ్యారు. ఐజీ చంద్రశేఖర్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. గత ఏడాది మార్చి 30న భూపాలపల్లి సీఐగా రాంనర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ధర్మపురికి రాంనర్సింహారెడ్డి బదిలీకాగా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. భూపాపల్లి జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు సీఐలు ఈ పోస్టింగ్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ములుగు సమగ్రాభివృద్ధికి అధిక నిధులు

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు, జనవరి 20: ములుగు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శనివారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమీక్షలో సీతక్కతోపాటు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీపీవో వెంకయ్య, డీఆర్‌డీవో నాగపద్మజ తదితరులు పాల్గొన్నారు. తొలుత ములుగు జిల్లాపై సమీక్ష జరిగింది. స్థానిక సమస్యలను మంత్రి సీతక్క వెల్లడించారు. ప్రధానంగా గోదావరి పరీవాహక గ్రామాలను ముంపు నుంచి కాపాడేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే కరకట్టల నిర్మాణం జరుగుతోందని, వరద ముంపు అవకాశాలున్న పలు చోట్లా రక్షణగోడ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించామని తెలిపారు. రామప్ప-లక్నవరం అనుసంధాన ప్రాజెక్టులో జాప్యం జరుగుతోందని, భూసేకరణకు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు కాలేదని అన్నారు. నిధులు విడుదల చేస్తే లక్నవరానికి గ్రావిటీ కెనాల్ ద్వారా గోదావరి జలాల తరలింపునకు మార్గం సుగమం అవుతుందన్నారు. అదే విధంగా గోదావరి బేసిన్‌లోని చెరువులు, కుంటలలోకి నీటిని మళ్లించాల్సి ఉందన్నారు. వాగులపై చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తే వర్షాకాలంలో వచ్చే వరదకు అడ్డుకట్ట వేసి జలాలను సమీకరించడం ద్వారా భూగర్భ నీటిమట్టాన్ని పెంచొచ్చని, సమీపంలోని పొలాలకు సాగునీటి అవసరాలు తీర్చొచ్చని తెలిపారు. వచ్చే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో రామప్ప, మేడారం, లక్నవరంతోపాటు అనేక పర్యాటక కేంద్రాలున్నాయని, వచ్చే బడ్జెట్‌లో పర్యాటకాభివృద్ధికి అధిక నిధులు ఇవ్వాల్సి ఉందన్నారు. మేడారం జాతర నిర్వహణకు మరిన్ని నిధులు కావాలని కోరారు. ఈనెల 25న లేదా 28తేదీల్లో రాష్ట్ర మంత్రులు మేడారం రావాలని ఆహ్వానించారు. మంత్రి సీతక్క ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గోదావరి ముంపు ప్రమాదం లేకుండా పరీవాహక గ్రామాల శివారులో రక్షణ గోడల నిర్మాణం చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు.



ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు భవేష్ మిశ్రా, ఇలా త్రిపాఠి, ములుగు ఎస్పీ శబరీశ్

సింగరేణి నిధులు సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి పొంగులేటి

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 20: సింగరేణి సీఎస్ఆర్ డీఎంఎఫ్‌సీ నిధులను నియోజకవర్గ అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శనివారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాలకు దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపించాలన్నారు. యుద్ధప్రాతిపదికన జనవరి 30 నాటికి ఈ పనులు పూర్తి చేయాలన్నారు. ఎస్సారెస్పీ, దేవాదుల కింద రెండో పంటకు ఏ మేరకు సాగునీరు అందిస్తామనేది స్థానిక ఎమ్మెల్యేలు రైతులకు సమాచారం అందించాలన్నారు. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లకు నిధులు విడుదల చేస్తామన్నారు. నిర్మాణం ప్రారంభంకాని వాటిని రద్దు చేసి ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామన్నారు.

అలసత్వం వహిస్తున్న ఎన్‌హెచ్ అధికారులు : కలెక్టర్ భవేష్ మిశ్రా

భారీ వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న జాతీయ రహదారుల మరమ్మతులు ఇంకా ప్రారంభం కాలేదని, ఎన్‌హెచ్ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. వర్షాల కారణంగా ధ్వంసమైన ఆర్అండ్‌బీ రోడ్లకు యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేశామన్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం టెండర్లు పూర్తి చేశామన్నారు. దూదెకులపల్లి రోడ్డు నిర్మాణం కోసం అటవీ శాఖ అనుమతులు లేక పనులు పూర్తికావడంలేదని తెలిపారు. అటవీశాఖ అనుమతులు ఇప్పిస్తే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. భూపాలపల్లిలో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామన్నారు. రామప్ప చెరువు నుంచి గణపురం చెరువుకు ఫీడర్ చానెల్ ద్వారా నీరు అందించే ప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణకు రైతులు అంగీకరించడంలేదని అన్నారు. ప్రభుత్వం నుంచి గెజిట్ రాకపోవడం వల్ల భూసేకరణ ఆలస్యమవుతోందని చెప్పారు.

రామప్ప- గణపురం చెరువుల అనుసంధానం పూర్తి చేయాలి : ఎమ్మెల్యే గండ్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రామప్ప-గణపురం చెరువుల అనుసంధానం కోసం భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. భారీ వర్షాలకు భూపాలపల్లి నియోజకవర్గంలోని 120 చెరువులు దెబ్బతిన్నాయని తెలిపారు. వీటి మరమ్మతులు చేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని అన్నారు. వచ్చే వర్షాకాలంలోగా పనులు పూర్తి చేసి సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. మొరంచపల్లి వద్ద ఉన్న వంతెన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. ఇందిరాసాగర్ ప్రాజెక్ట్, భీంఘన్‌పూర్, గణపురం చెరువులకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంచాయరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లను పునరుద్ధరించాలన్నారు. బొగ్గు, ఇసుక ద్వారా వచ్చే నిధులను నియోజకవర్గ అభివృద్ధికి వినియోగించేలా చూడాలన్నారు. నియోజకవర్గంలోని మినీ మేడారం జాతరలకు బస్సుల సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



కాటారంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రాంకుమార్

భూపాలపల్లిటౌన్/కాటారం, జనవరి 20: ఆరోతరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు భూపాలపల్లి జిల్లా విద్యార్థులు 337 మంది హాజరయ్యారు. భూపాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 238 మందికి 194 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. కాటారం జడ్పీహెచ్ఎస్‌లో 197 మందికి 143 మంది పరీక్ష రాశారు. రెండు పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి రామ్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్‌రెడ్డి పరిశీలించారు.

ములుగు జిల్లాలో 512మంది

ములుగు : జిల్లాలో శనివారం జవహర్ నవోదయ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ములుగు, ఏటూరునాగారం, వెంకటాపురం(నూగూరు) మండలాల్లో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 601 మంది విద్యార్థులకు 512 మంది పరీక్షకు హాజరయ్యారు. ములుగులోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 148 మంది, బండారుపల్లి మోడల్ స్కూల్‌లో 139 మంది, ఏటూరునాగారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 153 మంది, వెంకటాపురం (నూగూరు) జడ్పీహెచ్ఎస్‌లో 80 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు.

సాగునీటిని అందించాలని రైతుల రాస్తారోకో

వెంకటాపురం(నూగూరు), జనవరి 20: పాలెం ప్రాజెక్టు నుంచి సాగునీటిని అందించాలని కోరుతూ మండలంలోని చిరుతపల్లి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై గిరిజన రైతులు శనివారం ఆదివాసీ నవనిర్మాణసేన ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా నవనిర్మాణ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు మాట్లాడుతూ రూ.100కోట్లు వెచ్చించి నిర్మించిన పాలెం ప్రాజెక్టు నుంచి రావాల్సిన సాగునీరు పంట పొలాలకు అందకుండా గోదావరిపాలు అవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రాజెక్టు కెనాల్‌ను అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో సాగునీరు అందడంలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు పాలెం ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేసి సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. మూడు గంటలపాటు రాస్తారోకో జరగడంతో విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు అట్టం సత్యం, ఇర్ప బాబు, వెంకటరమణ, రమేష్, శివ, వాసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

వెంకటాపూర్(రామప్ప), జనవరి 20: మండలంలోని లక్ష్మీదేవిపేటలో ఇటీవల జరిగిన మండలస్థాయి షటిల్ క్రీడల్లో విజేతలకు శనివారం భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పోరిక రవీందర్ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం వల్ల అనారోగ్యానికి గురికాకుండా ఉండొచ్చని అన్నారు. అనంతరం చిర్ర మహేందర్, దర్శన్‌లకు మొదటి బహుమతి రూ.5,016, వినీల్, రాజేందర్‌కు ద్వితీయ బహుమతి రూ.3,016, ఉత్తమ క్రీడాకారుడు సంతోష్‌కు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ముక్కెర తిరుపతి, చిర్ర సిద్దు, గంట రాజు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంపై అవగాహన

మొగుళ్లపల్లి, జనవరి 20: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ సౌజన్యంతో వినుత బ్రాయిలర్ కోళ్ల ఉత్పాదక పథకం కింద మంజూరైన 45మంది లబ్ధిదారులకు శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ మండలంలోని పర్లపల్లిలో 15మంది, పెద్దకోమటిపల్లిలో ఐదుగురు, ఇస్సిపేటలో 13 మంది, పాత ఇస్సిపేటలో 10మంది, చింతలపల్లిలో ఇద్దరు చొప్పున 45మంది లబ్ధిదారులు బ్రాయిలర్ కోళ్ల ఉత్పాదక పథకం కింద ఎంపికయ్యారని అన్నారు. వారికి ఉచితంగా ఏడాదిలో ఒక్కో విడతలో 150 కోడిపిల్లలను నాలుగుసార్లు అందిస్తామని అన్నారు. దాణా, మందులు కూడా అందజేస్తామని తెలిపారు. ఈ సదస్సులో అసిస్టెంట్ డైరెక్టర్ వెంకన్న, వెటర్నరీ డాకర్లు శ్రీరామ్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలపై పంట రుణాలివ్వాలి : టీఏజీఎస్

కాటారం, జనవరి 20: అటవీ హక్కుల చట్టం ద్వారా పోడు పట్టాలు పొందిన రైతులకు బ్యాంకులు రుణాలివ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూదుల శంకర్, పోలం రాజేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులకు గత ప్రభుత్వం బ్యాంకు రుణాలిప్పించడంలో విఫలమైందని ఆరోపించారు. బ్యాంకు రుణాలు రాక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలతో అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు దయ్యం వినోద్, కాల్వపల్లి కల్పన తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి చేయూత

గోవిందరావుపేట, జనవరి 20: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పసి బాలుడి వైద్యానికి మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ చేయూతనందించారు. మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన వేల్పుగొండ నాగరాజు-మౌనిక దంపతుల కుమారుడు లక్ష్మణ్ ఇటీవల ఆడుకుంటూ కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా పరీక్షించిన వైద్యులు మెదడులో రక్తం గడ్డకట్టిందని, ఆపరేషన్ చేయాలని సూచించారు. పేదరికంలో ఉన్న నాగరాజు కుటుంబం గురించి తెలుసుకున్న తస్లీమా మహ్మద్ శనివారం బాలుడి తల్లిదండ్రులను పరామర్శించి వైద్యఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందించారు. అదేవిధంగా వైద్యులతో మాట్లాడి బాలుడికి మంచి వైద్యం అందించాలని ఆమె కోరారు.

బాలికల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

డీహెచ్ఈడబ్ల్యూ జిల్లా కో ఆర్డినేటర్ అనూష

కాటారం, జనవరి 20: బాలికల హక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం (డీహెచ్ఈడబ్ల్యూ) జిల్లా కో ఆర్డినేటర్ అనూష అన్నారు. మండలంలోని కాటారం గిరిజన సంక్షేమ బాలికల గురుకులం, దామెరకుంట సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. లింగ వివక్షను రూపుమాపాలన్నారు. బేటీ బచావో- బేటీ పడావో దిశగా సాగాలన్నారు. సీహెచ్ఎల్ (చైల్డ్ హెల్దీ లివింగ్) కేంద్ర కోఆర్డినేటర్ తిరుపతి మాట్లాడుతూ సమాజంలో బాలలపై, మహిళలపై జరుగుతున్న అరాచకాలను, వేధింపులను అరికట్టడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ 1098, 181 నంబర్లను వినియోగించాలన్నారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళా సాధికారత దిశగా అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో డీసీపీయూ కౌన్సిలర్లు శైలజ, మమత, కళావతి, సురేష్ ప్రతిజ్ఞ చేయించారు. గురుకులం ప్రిన్సిపాల్ శైలజ, వైస్ ప్రిన్సిపాల్స్ అనురాధ, రజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాజాతర పనుల్లో నాణ్యత పాటించాలి : తుడుందెబ్బ

ఏటూరునాగారం, జనవరి 20 : మేడారంలో జరుగుతున్న మహాజాతర అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు, అధికారులు నాణ్యతతో చేపట్టాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎట్టి ప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద జాతరగా కోట్లాది భక్తులు ఆరాధ్య, గిరిజన ఆదివాసుల ఆరాధ్యదైవాలు, వనదేవతలైన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వివిధ రాష్ట్రల నుంచి వస్తున్న కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మంగపేట, జనవరి 20: మండలంలోని రాజుపేటలో శనివారం సీసీ రోడ్ల పనులు శనివారం ప్రారంభమయ్యాయి. రూ. 20 లక్షలతో ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. పనుల ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లెపల్లి శివప్రసాద్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ ఇస్సార్‌ఖాన్, నాయకులు కర్రి నాగేంద్రబాబు, కోడం బాలకృష్ణ, సహకార సంఘం డైరెక్టర్ సునీత రామారావు తదితరులు పాల్గొన్నారు

రక్తదానం.. మహాదానం

ఎఫ్‌డీవో జోగేందర్

ములుగు కలెక్టరేట్, జనవరి 20: రక్తదానం మహాదానమని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం అందించడం గొప్ప విషయమని అటవీశాఖ డివిజన్ అధికారి జోగేందర్ అన్నారు. ములుగులోని ఏరియా ఆస్పత్రిలో ములుగు, సికింద్రాబాద్ వివేకానందపురం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బందికి శనివారం ప్రత్యేక వైద్యశిబిరం జరిగింది. ఈసందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్ అటవీశాఖ అధికారులు, సిబ్బందికి బీపీ, షుగర్, కంటి, దంత వైద్యం, రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఎఫ్‌డీవో జోగేందర్ రక్తదానం చేసి మాట్లాడారు. రాత్రి,పగలు అడవుల్లో తిరుగుతూ అటవీ జంతువులను రక్షించే సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడినట్లయితే వెంటనే ఆస్పత్రిలో చేరి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానందపురం లయన్స్‌క్లబ్ డైరెక్టర్ పింగిలి నాగరాజు, ములుగు ప్రెసిడెంట్ పూజారి రఘు, సభ్యులు చుంచు రమేష్, కొండి సాంబశివ, సానికొమ్ము రవీందర్‌రెడ్డి, ఉదయ్, బలరాంరెడ్డి, వైద్యులు ప్రవీణ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సుజిత్‌కుమార్, సతీష్, భరత్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం చేసిన ఎస్సై

ఏటూరునాగారం, జనవరి 20 : కన్నాయిగూడెం ఎస్సై సురేష్ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఏటూరునాగారం మండలంలోని షాపల్లి గ్రామానికి చెందిన గొత్తికోయ గర్భిణికి రక్తదానం చేశారు. అరుదుగా లభ్యమయ్యే ఏబీ పాజిటివ్ రక్తం గర్భిణికి అవసరం ఉందని ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ చూసి వెంటనే స్పందించారు. ఏటూరునాగారం చేరుకొని ఆ గర్భిణికి రక్తదానం చేశారు. విరివిగా శిబిరాలను ఏర్పాటు చేసి రక్తదానం కార్యక్రమాన్ని చేపట్టాలని బ్లడ్ డోనర్స్ గ్రూపు సభ్యులను సూచించారు. రక్తదానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎస్సైను బ్లడ్ డోనర్స్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ వహీద్, పెండ్యాల ప్రభాకర్, దామెర ప్రశాంత్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తం దానం చేస్తున్న ఎస్సై సురేష్

గట్టమ్మ దేవాలయం వద్ద టెండర్లను రద్దు చేయాలి

ఆదివాసీ నాయకపోడ్ జిల్లా అధ్యక్షుడు సురేందర్

ములుగు కలెక్టరేట్, జనవరి 20: మేడారం మహాజాతర నేపథ్యంలో ములుగులోని గట్టమ్మతల్లి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న టెండర్లను రద్దు చేయడంతోపాటు ఏకపక్షంగా వ్యవహరిస్తున్న డీఎల్‌పీవోను విధుల నుంచి తొలగించాలని ఆదివాసీ నాయకపోడ్ జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ డిమాండ్ చేశారు. గట్టమ్మతల్లి దేవాల యం ఆవరణలో పూజారుల ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో సురేందర్ మాట్లాడారు. గట్టమ్మతల్లి దేవాలయం వద్ద జాతర సమయంలో ఆర్డీవో, తహసీల్దార్, డీఎల్‌పీవోల ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకపోడ్ పూజారులు, జాకారం గ్రామపంచా యతీకి చెందిన వారితో కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేస్తుంటారని తెలిపారు. ఇందులో భాగంగానే ఈనెల 18న అధికారులు, పూజారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయగా నాయకపోడ్‌ల డిమాండ్లను పరిష్కరించాలని కోరామని అన్నారు. పరిశీలించిన అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేస్తామని తెలిపారని అన్నారు. కానీ, తమ డిమాండ్లను పరిష్కరించకుండా టెండర్లు నిర్వహి స్తామనడం సరికాదన్నారు. డీఎల్‌పీవో ఏకపక్షంగా టెండర్లు నిర్వహిస్తూ ఆదివాసీ నాయకపోడ్‌ల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రధాన పూజారులు సదయ్య, లక్ష్మయ్య, మొగిలి, సమ్మయ్య, పుల్లయ్య, సంజీవ, రఘు, రాజు, అచ్చ రాజు, సంతోష్, రవి, సురేష్, అరిగెల రఘు, రాజ్‌కుమార్, రాజేష్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

వెంకటాపురం(నూగూరు), జనవరి 20: మండలంలోని బెస్తగూడెం గ్రామంలో గుడుంబా స్థావరాలపై సీఐ బండారి కుమార్, ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. వెయ్యి లీటర్ల బెల్లంపానకం, దాని తయారీకి ఉపయోగించే వస్తువులను ధ్వంసం చేశారు. రాము, పుల్లారావు అనే వ్యక్తులపై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారీ కాని, విక్రయాలు కాని జరిపినట్లయితే కఠిన చర్యలు తీసుకుం టామని సీఐ హెచ్చరించారు.

- వెంకటాపూర్(రామప్ప): మండలంలోని గుర్రంపేట పంచాయతీ పరిధిలోని చక్రిప్పులపల్లి, మల్లయ్యపల్లి గ్రామాల్లో స్థానిక ఎస్సై చల్లా రాజు ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీ కోసం సిద్ధంగా ఉన్న బెల్లంపానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు గుడుంబా, పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. గుడుంబా తయారీకి పాల్పడుతున్న భూక్య రాజమ్మ, జర్పుల లక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు
- వాజేడు: గుడుంబా విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పేరూరు ఎస్సై గొర్ల రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులతో స్టేషన్ పరిధిలోని టేకులగుడెం, కృష్ణాపురం, గంగారం గ్రామల్లో గుడుంబా అమ్ముతున్న ఇళ్లల్లో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. కృష్ణాపురానికి చెందిన బలుసుపాటి లక్ష్మయ్య వద్ద 25 లీటర్లు, గంగారానికి చెందిన ఇర్పా ప్రణీత్ వద్ద 20 లీటర్లు, టేకులగుడెంలో కుర్సం సన్యాసి వద్ద 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. వీరందరూ ఛత్తీగఢ్ రాష్ట్రం నుంచి గుడుంబాను తీసుకొచ్చి గ్రామాల్లో విక్రయిస్తున్నారని తెలిపారు. పట్టుబడ్డ నిందితులపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.